# ఎన్నార్సీ జాబితాలో లేనివారికి కూడా పౌరసత్వం ఇవ్వాలి

**దేశవ్యాప్తంగా** జాతీయ పౌరసత్వ జాబితా ప్రతిపాదనను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించటం, బిజెపి నాయకుల అసలు వైఖరిని బట్టబయలు చేసింది. ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన విధానాలను అవలంబించటంకోసం ఏవిధంగానైనా సరే ప్రజలను మతాలవారీగా చీల్చటానికి వారు పూనుకుంటారన్నది జగమెరిగిన సత్యం.

దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపి కొత్త ఎన్నార్సీని తయారుచేయటానికి సుప్రీంకోర్టు అసోంలో చేపట్టిన ఎన్నార్సీని పక్కనబెట్టారు. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి రంజన్‌గొగోయ్ పదవీ విరమణ చేసిన ఒకరోజు అనంతరం ఈ విధమైన ప్రకటన వెలువడటం గమనార్హం. ఆయన నేతృత్వంలో అసోంలో జరిగిన ఎన్నార్సీ తయారీ పద్ధతి మొత్తం సుప్రీంకోర్టు ఆదేశాలకు భిన్నంగా చేపట్టబడింది.

19 లక్షలకు పైగా ప్రజలకు తుది ఎన్నార్సీ జాబితాలో చోటుదక్కలేదు. అలా చోటుదక్కని వారు విదేశీ ట్రిబ్యునల్‌కు 120 రోజులలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. దాని తర్వాత జాబితాలో లేనివారు డిటెన్షన్ క్యాంపులకు పంపబడతారు. ఏదేశమూ వారిని స్వీకరించదు. ఆ 19 లక్షలమంది ప్రజల జీవితాలు పెను ప్రమాదంలో పడ్డాయి.

ప్రస్తుతం స్థానిక జైళ్ళలో తాత్కాలిక సదుపాయాలు ఏర్పాటు చేయటంకాక అసోంలో ఆరు డిటెన్షన్ క్యాంపులు వున్నాయి. ఎన్నార్సీ జాబితాలో లేనివారి కోసం మరో పది డిటెన్షన్ కేంద్రాలను నిర్మించటానికి రాష్ట్రం ప్రతిపాదనలు చేస్తున్నది.

ఈ నేపథ్యంలో మరో ఎన్నార్సీ విధానం అసోం ప్రజలను మాత్రమేకాక యావద్భారత ప్రజలలో అనిశ్చితికి, ఆందోళనకు, భయానికి కారణమయింది. తమను తాము భారతపౌరులుగా నిరూపించుకోవటానికి ఎదురయ్యే చేదు, బాధాకర అనుభవాలను తలచుకుని వారు ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు.

పౌరసత్వ సవరణ బిల్లును మళ్ళీ పార్లమెంటులో ప్రవేశపెడతామని అమిత్‌షా ప్రకటించాడు. 1955 పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ 2019 జులై 19న భారత పౌరసత్వ సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. తీవ్రవ్యతిరేకతతో అది వీగిపోయింది. ఈ బిల్లు గనుక పార్లమెంటులో పాసయితే ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లనుండి అక్రమంగా వలసవచ్చిన, ఆ దేశాల్లో మైనారిటీలయిన హిందువులు, శిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్లు భారత పౌరసత్వానికి అర్హులవుతారు. భారత్‌లో వారు నివశించి వుండాల్సిన కాలాన్ని 11 సంవత్సరాలనుండి 6 సంవత్సరాలకు ఈ బిల్లు కుదించింది. వీరిలాగే వచ్చిన ముస్లిములు మాత్రం పౌరసత్వానికి అర్హులు కారు. అసోంలో నివసిస్తున్న ముస్లిం మైనారిటీలను వేధింపులకు గురిచేయడానికే ఈ పౌరసత్వ జాబితా నవీకరణ అని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.

సాక్షాత్తు ప్రధానమంత్రే తన డిగ్రీ సర్టిఫికెట్‌ను సంపాదించుకోలేని దేశంలో ఎవరికైనా ఐదు దశాబ్దాల క్రితం డాక్యుమెంట్లు సంపాదించటం ఎలా సాధ్యం? లక్షలాదిమంది భారతీయులు ఇండియానుండి వలసవెళ్ళి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో పౌరసత్వాన్ని పొందియున్నారు. ఎన్నార్సీ జాబితాలో లేని వారిని ఎందుకు ఇండియా తన పౌరులుగా ఇముడ్చుకోదు?

పౌరసత్వ జాబితా, పౌరసత్వ సవరణబిల్లు అనేవి అసోంలోను, దేశంలోని ఇతర ప్రాంతాలలోను వున్న ముస్లింలపై వివక్షతకు, వేధింపులకు ఉద్దేశించబడినవి మాత్రమే.

మత విద్వేషాలను రెచ్చగొట్టటంలో బిజెపికి వున్న గత చరిత్రను గమనంలోకి తీసుకుని అన్ని ప్రజాస్వామికశక్తులు దేశవ్యాప్త ఎన్నార్సీని, పౌరసత్వ సవరణ బిల్లును రద్దుచేయాలని డిమాండు చేయాలి. అసోంలో ఎన్నార్సీ జాబితాలో లేని 19 లక్షలమందికి వెంటనే పౌరసత్వం ఇవ్వాలని డిమాండు చేయాలి. 2019లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన పౌరసత్వ చట్టానికి సవరణలను వెనక్కుతీసుకోవాలని డిమాండు చేయాలి.

**కేంద్రకమిటి**
**సిపిఐ(ఎం-ఎల్)**

ooo